

# ఎన్‌కౌంటర్...

పాతికమంది పోలీసులు మెడల్లో రుద్రాక్షమాలలు, చేతుల్లో తుపాకులతో సహా అహింసాయుతంగా అడవుల్లో పాదయాత్ర చేస్తుండగా...

హఠాత్తుగా ఓ నక్సలైటుగాడు ఎదురై, రెండు చేతుల్లోను రెండు పిస్తోళ్లతో ఢాం... ఢాం... అంటూ దాడి చేసేడుట.

మొదట్లో ఆ పోలీసులు రుద్రాక్షమాలల్ని బహుప్రశాంతంగా తిప్పుకుంటూ అహింసా ప్రభోదాలు చేసేరుట, ఆ అమాయకుడికి.

కానీ, వాడు అవేవీ వినపడకుండా రెండు చెవుల్లోనూ రెండు తూటాలు ఇరికించుకుని మళ్లీ ఢాం... ఢాం... అనిపించాడట పిస్తోళ్లతోనే.

ఇహ లాభంలేదనుకున్న పోలీసులు తుపాకులెత్తి వాటిల్లో తలో రుద్రాక్షగుండూ పెట్టి, కళ్లు మూసుకుని "తండ్రీ! ఈ నిర్భాగ్యుడిని సరాసరి స్వర్గానికే తీసుకుపో" అని దేవుడుగారికో విజ్ఞాపన పత్రం సమర్పించుకుని మరీ అహింసాత్మకంగా ఢాం... ఢాం... అని పేల్చేసేరుట తుపాకులు.

అప్పుడా అజ్ఞాన నక్సలైటు వారి కోరిక ప్రకారం, అహింసాయుతంగానే చచ్చి శరీరంలో పాతిక రుద్రాక్ష గుండ్ల కన్నాల్తోసహా కైలాసానికి బట్వాడా అయిపోయాడుట.

పత్రికల్లో ఈ వార్త చదివి నేను చాలా ఆనందించాను.

ముఖ్యమంత్రి అంతటివాడే రుద్రాక్షమాలల్ని ధరించి వాటిని గౌరవిస్తుండగానే లేనిది, పోలీసు రుద్రాక్షల్ని సదరు నక్సలైటుగాడు గౌరవించకపోవటం ఏం మర్యాద? అదీగాక ముఖ్యమంత్రిగారు తను ముఖ్యమంత్రి కాకమునుపే "నక్సలైట్లు నాకు ఇష్టులే, వాళ్లు మాత్రం దేశం కోసం కాదా చస్తున్నది?" అంటూ స్టేట్‌మెంట్లిచ్చి ఉన్నారుగదా! మరలాంటి ముఖ్యమంత్రిగారి పోలీసుల మీద సదరు నక్సలైటుగాడు ఢాం... ఢాం... అంటూ విరుచుకుపడటం ఏం మర్యాద?

అనుకుంటూ పనిగట్టుకువెళ్లి ఆ దుర్మార్గుడి శవదర్శనం చేసుకున్నాను...

చేసుకుని, "ఔరా! నీవట్రా! సుబ్బిగా?" అని విస్మయంతో, విషాదంతో మూర్ఛపోబోయేను. అదృష్టవశాత్తు అక్కడే కాపలా ఉన్న రుద్రాక్ష పోలీసులు నేను పడిపోకుండా పట్టుకుని నిల

బెట్టేరు.

ఈ సుబ్బిగాడు... మరెవరోగాదు, మా కాలేజీలో ఒకప్పటి బుద్ధిమంతుడైన కుర్రాడే. తర్వాత్తర్వాత వాడి బుద్ధి ఓ ఎర్రట్ట పుస్తకానికి బందీ అయిపోయింది. అందుమీదట మరి కొందరు కుర్రాళ్లను వెంటేసుకుని అడవుల్లో కెళ్లిపోయేడు. అక్కడే గిరిజన తండాల్లో కాపురం పెట్టి వాళ్లతోపాటే కందమూలాదులు తింటూ, వాళ్లకేవేవో నూరిపోయడం మొదలెట్టాడు.

వాడితోపాటు కందమూలాలు నములూ్తా, రావి ఆకు చుట్టలూ, బీడీలూ కాలుసూ్తా కాలక్షే పంచేసే ఓపికలేని వాడి శిష్యులు, మనకాబోయే ముఖ్యమంత్రిగారు ఆ పదవిని పట్టుకునే ప్రయత్నంలో "నక్సలైట్లు నావాళ్లే" అనగానే..

'చూశావురా, సుబ్బిగా! మన విప్లవం విజయవంతం అయే సుదినం వచ్చేసింది! మనం వెళ్లి మన వాళ్ల ఓట్లన్నీ సదరు "సర్దార్ పాపారాయుడు" గారి డబ్బాల్లోనే వేయిద్దాం పద?' అని తొందరపెట్టేరుట.

"ఆగండ్రా! వెర్రి తెలుగు నాగన్నల్లారా! ఆ మనోడు నక్సలైట్లంటే "బొబ్బిలిపులి" సిన్మాలో హీరోగారి విప్లవాన్ని విజయవంతం చేసే ఎక్స్ట్రా వేషగాళ్లనుకుంటున్నట్లున్నాడు. తొందరప డొద్దు" అని వారించేడుట వీడు.

ఆ సలహా నచ్చనివాళ్లు వాళ్లదారిన వారుపోగా, మిగిలిన శిష్యుల్తో మన వాడలానే ఆ అడవుల్లో హింసాత్మకంగా, కందమూలాదులు భుజిసూ్తా, గిరిజనోద్ధరణను కంటిన్యూ చేయ సాగేడు.

సదరు గిరిజనులు వంటిమీద గోచీగుడ్డ తప్ప మరేమీలేని వాళ్లు. అమ్ముకోడానికి రెక్క లకష్టం తప్ప మరేం మిగుల్చుకోనివాళ్లు. వారంలో ఆరు పూటలన్నా కడుపునిండా తినగలి గితే అమ్మమ్మలు చెప్పిన పురాణ కథల్లోని రామరాజ్యం వచ్చేసిందనుకునేవాళ్లు. అదీ కర వయితే కష్టపడి కాచుకున్న ఇప్పసారా తాగితృప్తిపడేవాళ్లు.

ఆ ఇప్పసారా వాళ్లకు ఆరోప్రాణం.

ఆ ఇప్పసారాకే ముప్పొచ్చిపడిందో సుప్రభాతాన!

"మా బాసుగారు అరవై లక్షలు పెట్టి జిల్లా మొత్తం సారా కాంట్రాక్టు పాడేసేరు. మీరంతా మా ముద్రలేసిన గవర్నమెంటు సారా కొనుక్కుని... త్రాగి చావాల్సిందే తప్ప... మీ ఇష్టం వచ్చినట్లు ఇప్పసారా కాచుకు త్రాగి బతికే వీల్లేదు. కాస్తే చంపేస్తాం ఖబర్దార్" అన్నారు ఓ పాతిక మంది వస్తాదులోరోజు ఆ తండాకొచ్చి.

పాపం ఆ వస్తాదులు డొక్కుజీపుల్లో అడవి దారిన పడుతూలేసూ్తా అంతదూరం వచ్చి మరీ చెప్పేరన్న మర్యాదకూడా చూపలేదా గిరిజనులు. "మా ముత్తాతల, ముత్తాతల, ముత్తాతల కాలం నుంచీ ఇలా ఇప్పసారా కాసుకు తాగుతున్నాం. ఇప్పుడిదేంటీ? రామ రాజ్యం వచ్చేసిందా, అప్పుడే? " అని ఎదురు ప్రశ్న వేసేరుట.

"రామరాజ్యం సంగతి మాకు తెలీదు. మా బాసు మాత్రం రావణాసురుడే!" అంటూ పిస్తోలు తీసి వార్నింగులా పైకెత్తి ఓసారి శాంపిల్‌గా పేల్చేడుట,ఆ వస్తాదుల లీడరు. దెబ్బ కుతా అంటూ చెట్టుమీంచి పిట్టొకటిరాలి సదరు గిరిజనుల మధ్య పడిందిట. అది చూసి వాళ్లు వెనకడుగు వేయబోతుండగా....

ఈసారి ఏ తుపాకీ పేలకుండానే మరో చెట్టు మీంచి ఓ రాబిన్‌హుడ్ దూకేట్ట సదరు గుండాల మధ్యకు.

ఈ రాబిన్ హుడ్ విల్లూ, బాణాలూ మాత్రం గల ఒరిజినల్ రకం అయితే ఫర్లేదు, రాఫ్

మని కాల్చి పారేయచ్చు. కానీ వాడిచేతిలో ఓ పిస్తోలుంది. అది గురి తప్పదనీ, వాడూ గురితప్పని మనిషేననీ సదరు వస్తాదులూ, వాళ్ల లీడరూ కూడా అదివరకే చాలాచాలా కతలు విని ఉన్నారు. పైగా వాడి మీద ఓ డజనూ, వాడి పిస్తోలుమీద మరో డజనూ మర్డర్ కేసులు పెండింగులో ఉన్నాయిట కూడా. వాడెవడోకాదు, మనసుబ్బిగాడే!

అందుకని సదరు రాబిన్‌హుడ్, ఉరఫ్ నక్సలైట్ సుబ్బిగాడూ, వాడి చేతిలో పిస్తోలూ కనబడగానే ఆ వస్తాదులంతా కాలికి బుద్ధి చెప్పి, జీపుల్లోకురికి, సరాసరి వారి బాసుగారి గుహకేసి పారిపోయేరు.

సంగత్తెలిసి వారి బాసుగారున్నూ సరదార్ పీపారాయుడు, బొబ్బిలిపిల్లి సిన్మాల్లో విలన్‌లా హూంకరించేరుట. అయితే సిన్మాల్లో లాగా కొరడా తీసుకుని వాళ్లని ఉతికి, "పోండ్రా! పిరికి నాయాళ్లల్లారా!" అని గర్జించకుండా, తెలివిగా టెలిఫోన్ ఎత్తేరు.

పోలీస్ డిపార్టుమెంటులోని వాళ్ల బావమరిదికి ఫోనుజేసి "నేనింతదాకా మీ వెధవలకు పంచిపెట్టిన పాతిక లక్షలకూ పని తగిలింది" అంటూ జరిగిన కథంతా చెప్పి "చూడు బామ్మర్దీ! రామరాజ్యంలో ప్రజలు ప్రభుత్వ సారా తాగి చావకుండా స్వంత సారానే తాగి బతుకుతామనటం మన ప్రభుత్వ పరువుకు అమర్యాదా, నా బ్యాంకి బ్యాలన్సుకు పంచరూ కాదా? " అని ప్రశ్నించేరు.

అందుకా బామ్మర్ది "జీ హుజూర్ బావాజీ" అంటూ ఫోన్‌కే ఓ శాల్యూట్ కొట్టి అర్జంటుగా అరడజన్ జీపుల్లో, అరవై తుపాకులతో బయల్దేరారు.

తరవాత కథ మామూలే... వీళ్లను చూసి సదరు రాబిన్‌హుడ్ ఉరఫ్ సుబ్బిగాడు జోడు గుళ్ల పిస్తోలుతో అన్యాయంగా "ఢాంఢాం" అన్నాడు. అందుమీదట వీళ్లు సకారణంగానే కేవలం పాతిక తుపాకుల్తో మాత్రం అహింసాయుతంగా వాడి అంతు తేల్చుకున్నారు... మిగతా ముప్పయ్యయిదు తుపాకుల్నీ అసలు వాడనేలేదు.

కథ ఇంత క్లియర్‌గా ఉండగా సుబ్బిగాడి శిష్యులు అందులో "రచనా శిల్పం, వంచనా శైలి తప్ప జీవితం లేదు. ఉన్నదల్లా సరదార్ పీపారాయుడు లైపుకథ" అంటూ ఓ కరపత్రం వేసేరు.

వాళ్ల కథ ఏమంటే, ఆ అరవై తుపాకులూ జీపుల్లో వెళ్లి ఊరికి దూరంగా చడీ చప్పుడూ లేకుండా ఆపేరు. ముప్పయ్యయిదు మందిని తండా చుట్టూ కాపలాపెట్టి, పాతికమంది మాత్రం యూనిఫాం వదిలి, గోచీగుడ్డలు బిగించి గిరిజనుల్లా గొంగళ్లు భుజాల్నేసుకుని, ఆ గొంగళ్ల క్రింద తుపాకులు రడీ చేసుకుని సదరు రాబిన్‌హుడ్ నిద్దరోతున్న గుడిసెను చుట్టుముట్టేరు.

"చుట్టుముట్టి, మారుపలికే వీల్లేకుండా నిద్ర పోతున్న మనవాడి మీద పాతిక తుపాకులూ ఒకేసారి అహింసాత్మకంగా పేల్చేసి, డజనున్నర మర్డర్ కేసుల్లో చిక్కుకునున్న మా సుబ్బిగాడి చిక్కులన్నీ క్షణంలో వదిలించేసేరు.

ఆ తర్వాత సాంప్రదాయం ప్రకారం వాడి శవాన్ని కుక్కిమంచంతో సహా అడవుల్లోకి ఈడ్చుకుపోయి ఫోటోలు తీయించారు.

ఆ విధంగా ప్రభుత్వ పరువునూ, సారా సామ్రాట్ గారి బ్యాంక్ బాలన్సు బరువునూ కాపాడి శాంతి భద్రతల్ని రక్షించినవారైనారు.

ఆ మర్నాడు అసలు వేషాల్లోనే, పట్టపగలే గిరిజన తండామీదపడి, వాళ్ల ఇప్పసారా కుండల్ని పచ్చడిచేసి, సారాలో ఉచ్చపోసి, మళ్లీదాన్ని చేస్తే బొక్కలిరగదన్ని లాకప్‌లో పడేసి

ఉచ్చు తాగిస్తామని హెచ్చరించిన వారైరి.
అదీ మా సుబ్బిగాడి ఎన్‌కౌంటర్ కథ
ఏమిటీ? నిజమా...? అని ఆశ్చర్యపోతున్నారా?
అయ్యా, ఇది జీవితం! ఇదీ మనకు తెలీని జీవితం!!

*(ఈనాడు, 15.6.83)*

☆